క్లుప్తంగా

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్ష



దాచేపల్లి : పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నడికుడి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలు మంగళవారం ప్రారంభించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి జీ ఆదాంషఫీ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కొత్త పింఛన్ విధానం తీసివేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైల్వే ఉద్యోగులు చేపట్టిన దీక్షకు కాంగ్రెస్, సీపీఐ పార్టీలు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్యూజన్, యూనియన్ నేతలు చంద్రశేఖర్, రమేష్, సీపీఐ నేత మందపాటి రమణరెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై గ్రామసభ



దుర్గి: మండలంలోని ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రమైన దుర్గిలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్ హాజరై ఓటర్లకు అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన సిబ్బంది ఓటర్లకు ఈవీఎం, వివి ప్యాట్ల వినియోగంపై వివరించారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఇలాంటి అవగాహన సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. 10న కాకిరాల, మించాలపాడు, జంగమహేశ్వరపాడు, దుర్గిలలో, 11న కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు, 12న నెహ్రూనగర్‌తండా, తేరాల, పోలేపల్లి, ఆత్మకూరు గ్రామాలలో శిక్షణ పొందిన సిబ్బంది ప్రభుత్వ పాఠశాలల్లో, గ్రామ సచివాలయాల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు హాజరై తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి



దుర్గి: జాతీయ పశు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన దుర్గి పశు వైద్యశాలలో మంగళవారం పశువులకు టీకాల నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, సర్పంచ్ రాయపాటి మాణిక్యం పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పశుపోషకులు, రైతులు తప్పనిసరిగా పశువులకు ప్రాణాంతకమైన గాలికుంటువ్యాధి నివారణ టీకాలను ఇప్పించాలని రైతులకు తెలిపారు. వైద్య శిబిరానికి పరిసర గ్రామాల నుంచి వచ్చిన ఆవులు, గేదెలు, ఎద్దులకు 165 టీకాలను పంపిణీ చేసినట్లు డాక్టర్ దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కటకం గోపాల్, పశువైద్య సహాయ సిబ్బంది బత్తుల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ధనుర్మాస నగర సంకీర్తన



మాచర్ల: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి నగర సంకీర్తన కార్యక్రమం భారీ స్థాయిలో పట్టణంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన కమిటీ సభ్యులు, మహిళలు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. తెల్లవారుజామునే అర్చకులు, సభ్యులు వీరాంజనేయరెడ్డి, గట్ల కోటిరెడ్డి, చెన్నకేశవరావు, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో మహిళలు స్వామి వారికి హారతులిస్తూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శ్రీవారికి అలంకారం

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్ లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి జగన్మోహనాకార సుందర రూప అలంకారం చేశారు.

పల్లె వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



ఒప్పిచర్లలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు వారి గ్రామంలోనే అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంలో ఉద్దేశమదేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో మాచర్ల రోడ్డులో రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా పీఆర్కేను వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారి కల్యాణ మండపంలో రూ.6 లక్షలతో జరిగిన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ, ఎంపీటీసీ అనంతరామయ్య, మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీఆంజనేయులు, చిరుమామిళ్ల మధు, చిరుమామిళ్ల బుచ్చెయ్య, లాజర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చింతపల్లి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు. గ్రామ సర్పంచ్ పంగులూరి హైమావతిరామకృష్ణయ్య, మాజీ సర్పంచ్ ఉన్నం శ్రీను, ఎంపీటీసీ నిర్మల అచ్యుతరావు, ఉన్నం గిరి, అలుగునూరి అమరయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉంటే స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పింఛన్‌దారులు పాల్గొన్నారు. మండలంలో 7,511 మంది పింఛన్ లబ్ధిదారులకు జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందించే కార్యక్రమం పింఛన్ లబ్ధిదారుల ఆనందోత్సాహాల మధ్య కోలాహలంగా జరిగింది. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పెరిగిన రూ.3 వేల పింఛన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

మండలంలో ఇప్పటి వరకు రూ.135,86,40,000 మేర పింఛన్ల ద్వారా లబ్ధి చేకూర్చడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అమ్మ ఒడి ద్వారా మండలంలో విద్యార్థుల తల్లులకు ఇప్పటికి రూ.34 కోట్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా మరో రూ.397 కోట్ల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అల్లయ్యసావిత్రి, కోకా అక్కమ్మ, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, సర్పంచ్ ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసేందుకు ఆత్మీయ సమ్మేళనం



వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: గురజాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసేందుకు సంక్రాంతికి నాన్ రెసిడెంట్ ఆఫ్ గురజాల వారితో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రావాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కామేపల్లి శివారు బ్రాహ్మణపల్లి గ్రామంలోని మెడికల్ కాలేజీ వద్ద ఆత్మీయ సమ్మేళనం కొరకు ఏర్పాటు చేసిన ప్రాంగణాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో పుట్టి, పెరిగి చదువుకొని వ్యాపార రీత్యా, ఉద్యోగ రీత్యా వివిధ దేశాలు, రాష్ట్రాల్లో, జిల్లాల్లో ఉంటున్న నాన్ రెసిడెంట్ ఆఫ్ గురజాల ప్రజలందరికి ఈ నెల 14వ తేదీన సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మీయ సమావేశం ఎక్కడో కంటే అభివృద్ధి జరిగిన గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల సమీపంలోని మెడికల్ కాలేజీ వద్ద ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు జరగని అభివృద్ధిని ఈ నాలుగున్నర ఏళ్లలో చేసి చూపించామని అన్నారు. ఎక్కడెక్కడో నివసిస్తూ 2019లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించిన వారికి జరిగిన అభివృద్ధి తెలియాలని ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇంకా గ్రామాల అభివృద్ధికి ఏం చేయాలో వారి సూచనలు తీసుకోవటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఆత్మీయ సమ్మేళనానికి గురజాల నియోజకవర్గం నాంది పలికిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా హాజరు కావాలని తెలిపారు. మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ కొప్పుల పున్నమ్మ, సాంబయ్య, ఎంపీపీ అల్లు సత్యవతిపిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

15న జన్‌జాతి ఆదివాసీ కార్యక్రమం

ఏర్పాట్లు పరిశీలించిన ఐటీడీఏ అధికారులు



శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి

వెల్దుర్తి: ఈ నెల 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభయాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు చెంచు, గిరిజనులకు పల్నాడు జిల్లా ఐటీడీఏ నోడల్ ఆఫీసర్ బి.సి.ధనుంజయ, డీటీడబ్ల్యూవో ఎల్.వరలక్ష్మి అవగాహన కల్పించారు. అందులో భాగంగా మంగళవారం మండలంలోని దావుపల్లి, లోయపల్లి, చెంచు గూడెంలో వారు చెంచులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గిరిజనులతో ముఖాముఖి మాట్లాడతారని, ఈ కార్యక్రమంలో పాల్గొనే చెంచు గిరిజనులకు అవగాహన కల్పించటం జరిగిందన్నారు. ఈ నెల 15న ప్రధాని మోదీ ఢిల్లీలో వర్చువల్‌గా నిర్వహించే కార్యక్రమంలో అన్ని గూడేల నుంచి చెంచు గిరిజనులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈజీఎస్ స్పెషల్ ఆఫీసర్ ఎంవీవీ రాజు, ఆర్‌ఓఎఫ్ సెక్షన్ రాజు, సచివాలయం పంచాయతీ సెక్రటరీ హౌసింగ్ ఏఈ దుర్గాప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

ఈ నెల 15న చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభయాన్ కార్యక్రమం శిరిగిరిపాడు ఐటీడీఏ పాఠశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పరిశీలించినట్లు ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న ప్రధాని మోదీతో ముఖాముఖి కార్యక్రమంలో గిరిజనులందరు పాల్గొనాలన్నారు. అందులో భాగంగా శిరిగిరిపాడు ఐటీడీఏ పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువ రైతు బలి

సింగరుట్ల తండాలో విషాదం



ఘటనా స్థలంలో మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

కారెంపూడి: కరెంటు పోయిందిలే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎడ్జి ఫీజు వేద్దామని స్తంభం ఎక్కిన యువ రైతు విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన పేటసన్నెగండ్ల శివారు సింగరుట్ల తండా పొలంలో మంగళవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన యువ రైతు రామావతు వాసునాయక్ ఉదయం తన ట్రాక్టర్‌తో వరి చేను పంట దమ్ము చేస్తున్నాడు. అక్కడే అతని మిరప చేలో కూలీలు కాయలు కోస్తున్నారు. ఆ సమయంలో ఉదయం 10 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పోయిన ఎడ్జి ఫీజు వేద్దామని కరెంటు స్తంభం ఎక్కాడు. అయితే సింగిల్ ఫేజ్ కరెంటు ఉండడం వల్ల షాక్‌కు గురై కిందపడ్డాడు. అతను కింద పడిన చోట రాయి ఉండడంతో తలకు కూడా బలమైన గాయం కావడంతో వాసు నాయక్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామాంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాదు స్వీకరించి ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం గురజాల నుంచి మంగళవారం రాత్రి 7.30 గంటలకు తండాకు తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే వాసు నాయక్‌కు ఏడాది క్రితమే వివాహం అయింది. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు వివరణ ఇస్తూ రైతులు ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎడ్జి ఫీజు పోతే తప్పనిసరిగా సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఎస్ఐ, ఏఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పిడుగురాళ్ల: పట్టణంలోని డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఆర్టీసీకి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ఈ నెంబర్‌కు 9959225430 డయల్ చేయవచ్చునని అన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్



పిడుగురాళ్ల: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలోని 6వ సచివాలయం వద్ద మంగళవారం నూతనంగా మంజూరు అయిన పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ ప్రతి నెల మంజూరు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలో నూతనంగా 298 నూతన పింఛన్లు మంజూరు అయ్యాయి. మంజూరు అయిన వాటిల్లో పెన్షన్ దారులైన మద్దిగుంట్ల నారాయణకు రూ.3 వేల పింఛన్‌ను కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్‌లు మద్దిగుంట రవికుమార్, తడికమళ్ల వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో సమావేశం నేడు

దాచేపల్లి : నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ రైతులు, పారిశ్రామిక వేత్తలు, వినియోగదారుల సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏఈ భగవాన్ నాయక్ మంగళవారం తెలిపారు. నగర పంచాయతీ, గ్రామాల్లోని వినియోగదారులు విద్యుత్‌శాఖ పరమైన సమస్యలు సమావేశం దృష్టికి తీసుకురావాలని, సమస్యలు పరిష్కరించేందుకు సమావేశంలో చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు.

మాచవరం: మాచవరం మండలంలోని 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సమస్యలపై మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నందు బుధవారం రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ డి.మస్తాన్ మంగళవారం తెలిపారు. సమావేశానికి జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల కమిటీ హాజరవుతుందని, ఆయా గ్రామాల్లో నెలకొనియున్న సమస్యలను కమిటీకి తెలియజేయవచ్చని అన్నారు. కావున మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారులతో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పట్టణ విద్యుత్ శాఖ ఏఈ సైదారావు మంగళవారం తెలిపారు. సమావేశానికి రైతులు, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు, ఇతర వినియోగదారులు సైతం హాజరై వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారం చేపట్టటం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మాచర్ల: మాచర్ల పట్టణంలోని డివిజన్ పరిధిలో అన్ని అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయాల పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఈ జె.హరిబాబు అన్నారు. మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 33/11 కేవీ రింగురోడ్డు, సబ్ స్టేషన్, మాచర్ల మండలం వారు తాళ్ళపల్లి సబ్‌స్టేషన్‌లో, దుర్గి వారు దుర్గి సబ్‌స్టేషన్‌లో, వెల్దుర్తి వారు వెల్దుర్తి సబ్‌స్టేషన్‌లో, కారెంపూడి వారు కారెంపూడి సబ్‌స్టేషన్‌లో, రెంటచింతల వారు రెంటచింతల సబ్‌స్టేషన్‌లో నిర్వహించే మీటింగ్‌లకు హాజరు కావాలన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

మాచర్ల: పట్టణంలోని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వారి ఆధ్వర్యంలో పత్తి ఫ్యాక్టరీ ప్రాంతం, సాయిబాబా గుడి పక్క సందులో సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు మంగళవారం తెలిపారు. ఈ ముగ్గుల పోటీలో మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు



భోగి మంటలను వెలిగిస్తున్న తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల యాజమాన్యం



సంక్రాంతి ముగ్గులో పొంగళ్లు వండుతున్న మహిళలు



వెంకటేశ్వర స్వామి కల్యాణం నృత్యరూపకం చేస్తున్న విద్యార్థులు



మాచర్లలో సంక్రాంతి వేడుకలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

- తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నృత్యాలు
- అలరించిన భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు

పిడుగురాళ్లరూరల్: ఎన్ని పండుగలు ఉన్నా సంక్రాంతి పండుగ సంబరాలు, ప్రత్యేకతే వేరు. సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు నుంచే సందడి మొదలవుతుంది. అలాంటి సంక్రాంతి పండుగను జానపాడు గ్రామంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్‌లో సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తిరుమల ఆక్స్‌ఫర్డ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొల్లా శ్రీనివాసరావు, డైరెక్టర్ బొల్లా గిరిబాబు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి వేడుకలను పట్టణంలోని స్కాలర్స్ విద్యా సంస్థల్లో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంప్రదాయం ఉట్టిపడేలా భోగి మంటలు వేసి, చుట్టూ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేయటం, హరిదాసుల కీర్తనలు సంక్రాంతి పండగ గొప్పతనం తెలిపేలా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కాలర్స్ విద్యా సంస్థల డైరెక్టర్‌లు శ్రీనివాసరెడ్డి, జగదీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు...

ఉత్సాహంగా.. ఉల్లాసంగా సంక్రాంతి సంబరాలు పట్టణంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రత్యేకత గురించి పెద్దలు వివరించారు. భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.

మాచర్ల కృష్ణవేణి స్కూల్‌లో..

మాచర్ల: పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు సంక్రాంతి ముగ్గు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హరిదాసులకు పాత్రలో బియ్యం పోస్తున్న మహిళలు



సాంస్కృతిక నృత్యం చేస్తున్న చిన్నారులు